# కీర్తిశేషుడు

ఆ పత్రిక ఆఫీసు కొంచం హడావుడిగా వుంది. గత రాత్రి ఆ పత్రిక అధిపతీ, మేనేజింగ్ డైరెక్టరూ అయిన శ్రీనివాసయ్య హఠాత్తుగా మరణించాడు. డాక్టర్లు "హృద్రోగం వల్ల" అన్నారు. హృద్రోగంవల్లే అయివుండాలి. లేకపోతే ఏ జబ్బూ లేకుండా, మనిషి వున్నవాడు వున్నట్లు ఎందుకు మరణిస్తాడు? అందులో శ్రీనివాసయ్య, వయస్సు ఎంతవున్నా మనిషి కాయపారు మనిషి. ఏ బలహీనతలూ లేకుండా, నీటిగా, శాస్త్రోక్తంగా, ఒక పద్ధతిగా బ్రతికేవాడేమో, ఎప్పుడూ అతి ఆరోగ్యంగా వుండేవాడు. ఆ పగలంతా బాగానే వున్నాడు. ఆఫీసుకి వచ్చాడు. క్రొత్తగా వచ్చిన ఎడిటర్‌తో పత్రిక పాలసీని గురించి, ఎడిటర్ విధ్యుక్త ధర్మాలను గురించీ ఒక గంటసేపు మాట్లాడాడు. రాత్రి భోజనంచేసి పడక గది లోకి వెళ్ళేవరకూ బాగానే వున్నాడు. కాసేపటికి ఏదో ధ్వని వినపడితే ఆయన చెల్లెలు గదిలోకి వెళ్ళిందట. ఇంకేముంది?

మంచంమీద పడుకొని వున్నవాడు పడుకొని వున్నట్లు మరణించి వున్నాడు. మామూలుగా ఈ "హృదయాలు" అనేవి ఉన్నాయే, అవి భోజనాలు చేసింతర్వాతే ఆగుతూ వుంటాయట, ఈ మాటా డాక్టర్లే చెప్పారు.

ఎడిటర్ ఆచార్యకు ఈ కబురు ఆ రాత్రే తెలిసింది. తెలిసీ తెలియగానే శ్రీనివాసయ్య ఇంటికి పరుగెత్తాడు. శ్రీనివాసయ్య ఇల్లు పట్టణానికి దూరంగా విడిగా వుంది. అతనికి ఎవ్వరూ లేరు. వివాహం లేదు. ఒక్క చెల్లెలుమాత్రం అతనితో వుంది ఆమెను భర్త విడిచిపెట్టటంవల్ల అన్నతోనే, అతని మంచిచెడ్డలు చూస్తూవుంది. ఆచార్య వెళ్ళేటప్పటికి ఆమే, డాక్టరూ వున్నారు. డాక్టరు సంగతి సందర్భాలన్నీ చెప్పి, శ్రీనివాసయ్య మరణించివున్న గదిలోకి తీసుకొని వెళ్ళాడు. మంచంమీద ఉన్న శ్రీనివాసయ్య శవం చూపి, "నేను చెయ్యవలసింది చేశాను. కాని నేను వచ్చేటప్పటికే చెయ్యి దాటిపోయింది" అన్నాడు.

"ఏదో ధ్వని వినపడి నేను లోపలికి వచ్చాను. చూద్దునుగదా, మంచంమీద వెల్లికిలా వున్నారు. పిలిచాను. పలకలేదు. నాకు భయంవేసి వెంటనే డాక్టరుగారికోసం కబురు చేశాను" అన్నది శ్రీనివాసయ్య చెల్లెలు.

ఆచార్య కళ్ళకి శ్రీనివాసయ్య పడుకొని నిద్రపోతున్నట్టుగానే కనిపించాడు. కుడిచెయ్యి మాత్రం మంచంమీద నుంచి వ్రేళ్ళాడుతూవుంది. ఆ చేతి క్రిందగా భూమిమీద ఒక పుస్తకం పడివుంది. ఆ పుస్తకం చదువుతూవుండగా గుండె

నొప్పి ఒచ్చిఉంటుందనీ, అప్పుడది చెయ్యిజారి క్రిందపడి వుంటుందనీ అనిపించింది ఆచార్యకు. అదేం పుస్తకమో తెలుసుకోవా లనిపించి పరీక్షగా చూశాడు. దాని పేరు "యౌవనారంభం." అట్టమీద నవయౌవనంతో పొంగిపొర్లే ఒక యువతిబొమ్మ వుంది. సమయం అందుకు అనుకూలంగా లేకపోయినా, ఆచార్యకు ఆశ్చర్యం వేసింది. శ్రీనివాసయ్య చేతుల్లోకి ఇటువంటి పుస్తకం ఎందుకు వచ్చివుంటుంది? ఎట్లా వచ్చివుంటుంది?

"మరి సెలవు" అన్నాడు డాక్టరు.

డాక్టర్ని గడపదాకా సాగనంపి వచ్చారు ఆచార్యా, శ్రీనివాసయ్య చెల్లెలూ. డాక్టరు వెళ్ళగానే ఆచార్యకు స్ఫురించింది. "బంధువు లెవరివయినా..."

"ఏ బంధువులూ లేరు" అన్నది ఆమె.

"మిత్రులు ?"

ఆమె ఆలోచనలో పడ్డది. చెప్పదగిన మిత్రులుకూడా ఎవ్వరూ లేరని ఆమె వైఖరివల్ల గ్రహించాడు ఆచార్య. అకస్మాత్తుగా భారమంతా తనమీదే పడ్డదని గ్రహించాడు. ఇంట్లో నౌకరు కూడా వున్నట్టు లేదు. అతనే పత్రిక ఆఫీసుకు ఫోను చేశాడు. ఊళ్ళోవున్న పెద్దమనుష్యులకు ఫోను చేశాడు.

అతను ఫోను చేస్తుంటే, "ఎందుకు వాళ్ళంతా? ఎవ్వరు ఒచ్చిమాత్రం చేసేదేముంది!" అన్నది శ్రీనివాసయ్య చెల్లెలు. కాని పదిమందికీ ఎంత త్వరగా తెలిస్తే అంత

మంచిది అనుకున్నాడు ఆచార్య. ఎంతమందికి తెలిస్తే అంత మేరకు తనబాధ్యత తగ్గినట్లేనని ఆచార్య అనుకున్నాడు.

*   *   *

మరునాడు ఆచార్య ఆఫీసు గదిలో కూర్చొని శ్రీనివాసయ్య జ్ఞాపకార్థం ప్రత్యేక సంచిక ఒకటి తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు దానికి అవుసరమైన విషయ సేకరణను గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు కొత్తగా వచ్చిన వాడు అవటంవల్ల, శ్రీనివాసయ్యని గురించి అందరికీ తెలిసిన విషయాలే తనకూ తెలుసు; ప్రత్యేకంగా ఏమీ తెలియదు. శ్రీనివాసయ్య వ్యక్తిగత జీవితం ఎటువంటిది? అతను స్వయం శక్తిమీద పైకివచ్చాడు అంటారు. ఏవిధంగా పైకివచ్చాడు? అతను ఋషుల కోవకు చెందినవాడు అంటారు. ఈ ఔన్నత్యం అతను ఏ విధంగా సంపాదించాడు? ఇవన్నీ తెలుసుకోవాలనుకున్నాడు ఆచార్య. ఇవన్నీ తెలుసుకొని ప్రత్యేక సంచికలో తానొక వ్యాసం వ్రాయాలనుకున్నాడు. ఇందుకు ఎవ్వారెవర్ని కలుసుకోవాలా? అని ఆలోచించాడు. శ్రీనివాసయ్య చెల్లెలూ, మరణకాలంలో చికిత్స చేసిన డాక్టరూ కొంతవరకు సహాయ పడవచ్చు అనుకున్నాడు. తనకు ముందు పనిచేసిన ఎడిటరు కూడా కొంతవరకు సహాయపడవచ్చు అనుకున్నాడు. కాని అతను ఎక్కడ వున్నదీ ఎవ్వారికీ తెలియదు. సబ్ ఎడిటర్లను పిలిచాడు. ప్రత్యేక సంచిక వొకటి వెయ్యాలనే తన ఉద్దేశాన్ని వారికి చెప్పాడు. వారు పైకి ఏమీ

మాట్లాడలేదుగాని, పెద్ద ఇష్టం వున్నట్లుగా ప్రవర్తించలేదు. ఒకరి మొహాలు ఒకరు చూసుకొని వూరుకున్నారు.

"నేను కొత్తవాణ్ణి. మీలో చాలామంది ఇక్కడ చాలాకాలంనుంచీ పనిచేస్తున్నారు. ఆయన్ని గురించి అనేక సంగతులు మీకు తెలిసివుండవచ్చు. ఎవ్వారికి తెలిసిన సంగతులు వారు చెప్పితే..."

సీనియర్ సబ్ ఎడిటర్ ధైర్యం చేశాడు-"వారిసంగతి మాకు ప్రత్యేకం ఏమీ తెలియదండీ ... మాకు ఏది కావలసినా మేము ఎడిటర్‌గారితోనే డీల్ చేసేవాళ్ళం. మాలో ఎక్కువ మందిమి వారిని చూడనైనా చూడలేదు. నామట్టుకు నేను వొక్కసారి కాబోలు, వారు మెట్లు ఎక్కుతుంటే చూశాను. ఒక్కసారి కాబోలు ఆఫీసు గదిలో ఎవ్వరిమీదో కేకలు వేస్తుంటే విన్నాను" అన్నాడు.

"మేము అదీ లేదు" అన్నాడు మరొక సబ్ ఎడిటర్.

అందర్లోకీ కుర్రవాడు ఏదో చెప్పబోయాడు. కంఠం సవరించుకొని ఎలా మొదలుపెట్టాలో తెలియక వూరుకున్నాడు.

"తెలిసిఉంటే మేనేజరుకి తెలిసివుండవచ్చు. చాలా కాలంనుంచీ ఆయనకింద పని చేస్తున్నాడు. ఆయన ఈ పత్రిక స్థాపించక ముందునుంచీ, ఆయనతోనే వున్నట్లు వినికిడి" అన్నాడు సీనియర్ సబ్ ఎడిటర్.

ఇక వీళ్ళతో లాభం లేదనుకొని వాళ్ళని పంపింది, మేనేజర్ని రమ్మనమని కబురు చేశాడు. కాసేపటికి ఫోర్‌మన్ రంగయ్య వచ్చాడు.

"మేనేజరుగారు ఇవ్వాళ ఆఫీసుకి రాలేదండీ. సెలవు పెట్టారు" అన్నాడు.

"పోనీ నువ్వే చాలు" అని, "శ్రీనివాసయ్యగారిని నువ్వు చాలాకాలంనుంచీ ఎరుగుదువు అనుకుంటాను!" అన్నాడు.

"ఎరుగుదును."

"వారెందుకు వివాహం చేసుకోలేదో!"

"అవన్నీ నాకెట్లా తెలుస్తయ్యండీ! 'ఇష్టంలేక' అని కొంతమంది అంటారు. మరికొందరేమో...."

"ఏమంటారు?"

"నాకెట్లా తెలుస్తుందండీ! ఏమీ అనరు" అని ముగించాడు.

రంగయ్య తన దగ్గర ఏదో దాస్తున్నాడని గ్రహించాడు ఆచార్య. "నువ్వెక్కడ వుండేది రంగయ్యా!" అని అడిగాడు.

"ఇక్కడేనండీ; ఈ ఆఫీసులోనే."

"అదికాదు, నీ ఇల్లెక్కడని!"

"కుళ్ళిందన్లో" అని చెప్పాడు రంగయ్య ముక్తసరిగా.

కుళ్ళిందన్ని గురించి ఆచార్య ఎక్కడో వినివున్నాడు. అది ఆ పట్టణంలోకెల్లా మురికికూపం అని. అందుకని అడిగాడు.

"అక్కడెందుకుంటున్నావ్!"

"ఉండక ఏం చేసేది!" అతి విచారంగా అన్నాడు రంగయ్య.

"ఇంకెక్కడా యిల్లు దొరక్కపోయిందా!"

"దొరుకుతుంది."

"అయినప్పుడు...."

రంగయ్య ఇక వొక్క ముక్క చెప్పదలచలేదు. "ఏదో వుంటున్నాం. ఎక్కడో వొకక్కడ, ఎక్కడైతే వుంటానికి!.. అక్కడ వుంటానికైనా వీలుదొరికింది. అదీ లేనివాళ్ళు ఎంత మంది! అక్కడికి అదే సంతోషం...." అన్నాడు.

"అది సరే..."

"తమరేదో పనివుండి పిలిపించారు... మేనేజరు సెలవు మీద వున్నాడని చెప్పటానికివొచ్చాను...చేతిలోపని వొదిలి వొచ్చాను...సెలవిప్పిస్తే..."

"సరే..." అన్నాడు ఆచార్య ఇక ప్రశ్నించి లాభం లేదనుకొని.

రంగయ్య వెళ్ళిపోయాడు. ఆచార్య ఆలోచిస్తూ కూర్చున్నాడు. కిటికీలోనుంచి, దూరంగా సబ్ ఎడిటర్లు వున్న గది కనిపిస్తోంది. వాళ్ళేదో రాసుకుంటున్నారు. మధ్యమధ్య వొకరి చెవుల్లో వొకరు ఏదో వూదుకుంటున్నారు. రెండో ప్రక్కనుంచి కంపోజిటర్లు అక్షరాలు కూరుస్తున్న "టకటక" ధ్వని వినిపిస్తూంది. ఆచార్య నెమ్మదిగా తన కుర్చీలో నుంచి

కథా నిలయం
3542



లేచి కోటు తగిలించుకొని బయటకు వెళ్ళాడు. ఏకాఏకిని శ్రీనివాసయ్య ఇంటికి వెళ్ళాడు...

రాత్రిపూట అతను సరిగ్గా గమనించలేదుగాని, అది అతిపురాతన కట్టడం. ఇటీవల దానికి మరామత్తులేమీ జరిగినట్టు లేవు. ఒంటరిగా దిగులుగా తనలోకి తాను చూసుకుంటూ నిలబడివుంది ఆ కట్టడం. లోపల బావురుమంటూ వుంది. చలనంలేదు. అతను ప్రవేశించిన కాసేపటికి శ్రీనివాసయ్య చెల్లెలు లోపలనుంచి వచ్చింది. ఆమె కోర్కెలు అణుచుకొని ఎండిపోయిన మనిషిలాగుంది. సరిగ్గా ఆ ఇల్లు ఆమెకూ, ఆమె ఆ ఇంటికీ సరిపోయినట్లుంది. ఎందుకనో మొదటిరాత్రి చూచినప్పుడు ఇలా అనిపించలేదు ఆచార్యకి. బహుశా అతని మనస్సు శ్రీనివాసయ్య మరణ వార్తలతో నిండిపోయివుండి, శ్రీనివాసయ్య చెల్లెలూ పరిసర ప్రాంతాలూ మనస్సుకి ఎక్కివుండవు. నెమ్మదిగా ఆమెకు తనువచ్చిన పని చెప్పాడు. శ్రీనివాసయ్య జీవితంలో ఇతరులకు తెలియనివీ, తనకు తెలిసినవీ ఏమైనా సంగతులు వుంటే చెప్పమన్నాడు.

"నాకేం తెలుసు! .... ఆయన జీవితంలో ఇతరులకు తెలియనివిమాత్రం ఏమున్నాయి!" అన్నది ఆమె. ఆమె నోటివెంట మాటలు సహజంగా రాలేదు. చాలా రోజులనుంచి అన్నంలేక సోమవచ్చిన మనిషి మాట్లాడినట్లు మాట్లాడింది.

ఆమె వైఖరిచూస్తే నిజంగానే ఆమెకేమీ తెలియదు అనిపించింది. కొంతమంది వుంటారు. వాళ్ళకి కళ్ళముందు అనేకం జరుగుతుంటాయి కాని అవి వారికి తెలియవు. అంటే

మనస్సుని వాటిమీద నిలిపి, వాటినిగురించి ఆలోచించరు. ఈమే అటువంటిదే....

"పోనీ ఈ సంగతులు రైటో కాదో చెప్పండి" అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

ఆచార్య తాను వ్రాసుకున్న నోట్సునుంచి చదివాడు:

"వయస్సు 71"

ఆమె ఆలోచించింది. ఏమో గుర్తులో జ్ఞాపకం తెచ్చుకుంది. చివరకు "అవును" అన్నది.

"మీ రీ వూరువచ్చింది 1901 లో"

ఆమె మళ్ళీ ఆలోచించింది. చూపులు సంఘటనలనో స్మృతిపథానికి తెచ్చుకున్నాయి. మళ్లీ "అవును" అన్నది.

"వారెన్నడూ వివాహం చేసుకోలేదు."

"లేదు!"

"చేసుకోవాలనికూడా అనుకోలేదు."

"లేదు... అనుకుంటే యెందుకు చేసుకోకుండా వుండేవారు!"

"ఆయన మంచిచెడ్డలు మీరే చూస్తూండేవారు."

"మంచిచెడ్డ లేమున్నాయి! అన్నంవండి పెట్టేదాన్ని... నాతోతప్ప ఎవ్వరితోనూ ఆయన వండించుకునేవారుకాదు."

"తరచు ఎక్కడికైనా వెళ్తుండేవారా?"

"ఎక్కడికీ వెళ్ళేవారు కాదు. వెళ్తే ఆఫీసూ, లేకపోతే ఇల్లూ... ఇంట్లో ఉన్నంతసేపూ మీరు చూశారే ఆగదిలోనే వుండేవారు" కాసేపు ఆగింది. ఏదో జ్ఞాపకం వచ్చింది.

"అప్పుడప్పుడూ బొంబాయి వెళ్తుండేవారు" అన్నది.

"ఎందుకో?...బహుశా వ్యాపారం పనిమీద అయి వుంటుంది" అన్నాడు ఆచార్య.

"తెలియదు."

"అక్కడ వారి కెవరయినా స్నేహితులున్నారా?"

"ఏమో!" కాసేపు ఆగింది. ఏదో జ్ఞాపకం వచ్చింది. "స్నేహమో ఏదో... ఏదో సందర్భంలో వొకటి రెండుసార్లు ఏదో... పేరు... ఆఁ ... భీమశంకరంగారి పేరు చెపుతూ వచ్చారు."

"ఏ భీమశంకరం?"

యంత్రంలా కదిలింది - "కాకర్ల"

"కాకర్ల భీమశంకరంగారా?"

"అవును."

"బొంబాయిలో..."

"బొంబాయిలోనే! నాకు బాగా జ్ఞాపకం."

ఆచార్య యిక పరవాలేదు అనుకున్నాడు. కొంచెం ధైర్యం చేశాడు.

"మీరు ఎప్పుడూ మీ అన్నగారితోనే వుంటున్నారా"

"అవును."

"అంటే; మీకు వివాహమైన మొదటి రోజుల్లో..."

ఆమె అతణ్ణి చూసింది. అవే చూపులు, భోషరావటం వల్ల దేనిమీదా నిలవలేని చూపులు...

"కొన్నాళ్ళు విడిగా వుండివుంటారు" అని సర్దాడు.

ఆమె ఆలోచించింది. "కొద్దిరోజులు" అన్నది. "నేను తిరిగి వచ్చాను. మళ్ళీ వెళ్ళలేదు" అన్నది.

"ఎందుకనో!"

"నేను వచ్చిన కొద్ది రోజులకే వారు మరణించారు. అకస్మాత్తుగా మరణించారు...అనుమానం వొచ్చి అన్నగారు చాలా కూపీతీశారు..." ఇంతవరకు చెప్పి మళ్ళీ ఆలోచించింది.

"అప్పటినుంచీ వీరితోనే వుంటున్నారు!"

"అవును..."

కథ రక్తికడుతూవుంది. వెలుతురు కనుపిస్తూవుంది. ఆచార్య మనస్సులో ప్రశ్నలమీద ప్రశ్నలుపుట్టుకొస్తున్నాయి. వాటిని జాగ్రత్తగా చేసి తర్వాత వేది అడగాలో వరుసగా పేరుస్తున్నాడు.

ఇంతలో ఏం జరిగిందో! ఆమెకు ఏంజ్ఞాపకంవచ్చిందో! "మీరు నాకు వొక సహాయం చెయ్యాలి" అన్నది.

"చెప్పండి."

"నిన్న వొచ్చాడే డాక్టరు-అతను ఏభై రూపాయిలకు బిల్లు పంపించాడు. అది చాలా ఎక్కువ,..ఏభై రూపాయిలు! ఏం చేశాడని! మీరు అతనితో మాట్లాడాలి."

ఇంత త్వరలో ఆమె టాపిక్ మార్చటం ఆచార్యకు యిష్టంగాలేదు. శ్రీనివాసయ్య మరణం యింకా ఆరలేదు. అప్పుడే డాక్టరు బిల్లువిషయం తర్జనభర్జన చెయ్యటం అతనికి ఏహ్యం అనిపించింది. చెట్టంత అన్న పోయి శోకముండే, డాక్టరు బిల్లువిషయం ఎట్లా బేరం చెయ్యటానికిపూనుకుందా అని ఆశ్చర్యపడ్డాడు. ఏమీ అనలేక, మనస్సులో రేగుతున్న ప్రశ్నలను బయటపెట్టలేక మెదలకుండా కూర్చున్నాడు.

ఆమె నెమ్మదిగా అతనివేపుకి చూపులుత్రిప్పి, "మీరు అతనితో మాట్లాడాలి. ఏభై రూపాయలే! యేం చేశాడని!" అన్నది.

ఆచార్య ఊరుకోలేకపోయాడు. "మీరే పిలిపించి మాట్లాడితే బాగుంటుంది అనుకుంటాను... ఎరిగి వున్నవాడవటంవల్ల మొహమాటం వుంటుంది."

"మేము అతన్ని ఎరగం. మాకు అసలు మందులుతినే అలవాటులేదు. అన్నగారికి ప్రకృతి వైద్యం అంటే యిష్టం. ఎప్పుడూ జబ్బంటే యేమిటో ఎరుగరు. ఎప్పుడన్నా కొంచం జబ్బుచేసినా తొట్టిస్నానం చేసేవారు. నా ఎరుకలోఎప్పుడూ డాక్టరు ఈ యింట్లో అడుగుపెట్టి ఎరగడు... నేనే తికమకపడి పిలిపించాను. వొచ్చిమాత్రం యేం చేశాడు? అన్నగారుబ్రతి

కితే నేను చేసిన పనిని సహించేవాడు కాదు...ఆయనకు ఇటు వంటి బలహీనతలు గిట్టవు.''

ఆమె యెక్కడలేని బలం తెచ్చుకుని మాట్లాడింది. నాలుగు మాటలూ మాట్లాడి సొమ్మసిల్లిపోయినట్లు కళ్ళు మూసుకొని కూచుంది. ఆచార్య కాసేపు చూశాడు. యిక కదిలించి లాభంలేదని వెళ్ళటానికి లేచాడు.

“మీరు డాక్టరుగారితో గట్టిగా మాట్లాడాలి. యేం చేశాడని యేభైరూపాయిలు!'' అన్నది.

ఆచార్య, డాక్టరు అడ్రెస్ తీసుకొని ఆఫీసుకి బయులు దేరాడు. అక్కడనుంచి డాక్టర్‌కి ఫోన్‌చేసి సంగతి సందర్భా లన్నీ చెప్పాడు. ఎన్నిచెప్పినా డాక్టరు 'ససేమిరా'అన్నాడు. ఫోను అక్కడపెట్టి, శ్రీనివాసయ్యా చెల్లెల్ని గురించి ఆలో చిస్తూ కూర్చున్నాడు. 'ఇక యీ పత్రికకు అధికారిణి ఆమే కాబోలు' అనుకున్నాడు. ఆమె క్రింద ఈపత్రికను ఎలా నడప టమా అని యోచనలో పడ్డాడు. ప్రత్యేక సంచిక సంగతి ఆలోచించాడు. ఏమైనా ఆధారాలు దొరుకుతయ్యేమోనని శ్రీనివాసయ్యా ఆఫీసుగదిలోకి వెళ్లాడు. దాని తాళపుచెవి తన దగ్గరేవుంది. ఆ గదిలో ఒక కుర్చీ, ఒక డ్రాయరూ, రెండుబీరు వాలు మాత్రమే వున్నాయి. గోడకు మహాత్మాగాంధీ ఫోటో, రవీంద్రనాథ ఠాగూరు ఫోటోవున్నాయి. అంతే. అంతాసింపు ల్‌గావుంది. బీరువాల్లో ఏవేవో పుస్తకాలున్నాయి. డ్రాయర్లో పేపరు కటింగులూ, కొన్నికొన్ని టైపుచేసిన వ్యాసాలూ' కొన్ని పుస్తకాలూవున్నాయి. అందులో 'ఫుడ్ పాయిజనింగ్'

అనే ఒక పుస్తకం ఆచార్య దృష్టిని ఆకర్షించింది. దాన్ని తీసి వేరుగా పెట్టాడు. ఇంకా గాలించగా కొన్ని బిల్లులు దొరికాయి. అందులో ఎక్కువ బొంబాయిలోని హోటళ్ల బిల్లులే. అన్ని బిల్లులూ డబుల్‌రూమ్ బిల్లులే. గతించిన నెలకు సంబంధించిన బిల్లులుకూడా వున్నాయి. ఆ బిల్లులు చూడగానే కాకర్ల భీమశంకరం జ్ఞాపకం వొచ్చాడు. వెంటనే తన ఆఫీసు గదికివొచ్చి బొంబాయిలో తన స్నేహితు డొకడికి కాకర్ల భీమశంకరాన్ని కలిసి, శ్రీనివాసయ్య మరణం సంగతి చెప్పి ఆయన్ని గురించి ఒక వ్యాసం వ్రాయించి వీలైనంత తొందరగా పంపించవలసిందని ఒకఉత్తరంవ్రాసి పోస్టుచేయించాడు. అర్జంటుకాగితాలు వుంటే వాటినిచూచి సీనియర్ సబ్ ఎడిటర్‌ని పిలిచాడు. అతనితో, "పూర్తి మేటర్ తొందరగా దొరికేటట్టులేదు. ప్రత్యేక సంచిక దినంనాటికి తీసుకువద్దాం" అని చెప్పి, తాను బయలుదేరేడు. సరాసరి మేనేజరు ఇంటికి వెళ్ళాడు.

* * *

మేనేజరు ఇల్లు ఒక ఇరుకు సందులోవుంది. ఇంటిమీద ఇల్లు వున్న సందూ అది. బళ్ళు తప్పుకోటానికి వీల్లేని సందు. పైగా రెండుప్రక్కలా మురికి కాలువలు. ఆచార్య మేనేజరు ఇంటిముందు నిలబడి పిలిచాడు. నాలుగుపిలుపులయింతర్వాత ఒక కుర్రవాడు బయటకువొచ్చి, "ఎవ్వరు కావాలి?" అని అడిగాడు.

ఆచార్య చెప్పాడు. కుర్రవాడు లోపలకు వెళ్ళాడు. ఆ కుర్రవాణ్ణి ఎక్కడో చూచినట్లువుంది ఆచార్యకు. ఇంతలో మేనేజరు బయటకు వచ్చాడు. ఆచార్య అక్కడకు రావటం అతనికి ఆశ్చర్యం వేసింది. ఏదో అనుమానం వేసింది.

"దయచెయ్యండి" అన్నాడు. ఇంతలో కుర్రవాడు లోపలనుంచి చాప తెచ్చి అరుగుమీద పరిచాడు. ఆచార్య కూర్చున్నాడు.

"నువ్వుకూడా కూర్చో" అన్నాడు ఆచార్య.

"నేను కూర్చోడాని కేమిలెండి! మీరేదో పనిమీద వచ్చారు... నా కివాళ వంట్లో బాగాలేక ఆఫీసుకి రాలేక పోయాను."

"బాన్దేముంది... నీతో కొంచం పనుండే వచ్చాను... శ్రీనివాసయ్యగారు మరణించిన సంగతి నీకు తెలుసుగా. ఆయన పని గురించి దినంనాటికి ఒక ప్రత్యేక సంచిక తీసుకువద్దాం అనుకుంటున్నాను."

శ్రీనివాసయ్య పేరుఎత్తిందగ్గరనుంచీ మేనేజరు ముఖ కవళికలు మారుతున్నయని ఆచార్య గ్రహించాడు. ఒక్క క్షణం వూరుకున్నాడు - ఎత్తుకున్నాడు.

"శ్రీనివాసయ్యగార్ని నువ్వు చాలా కాలంనుంచీ ఎరుగుదువు."

"చాలా కాలంనుంచీ" అన్నాడు మేనేజరు. అతని ముఖం జేవురించింది.

"ఆ సంచికకు నేను ఒక ప్రత్యేక వ్యాసం వ్రాద్దామను కుంటున్నాను. ఆయన్ని గురించి నీకు తెలిసిన సంగతులు చబితే."

మేనేజరు మాట్లాడలేదు. పెళ్ళగిలి వస్తున్న కోపాన్ని ఆపుకుంటున్నట్లు కనుపించాడు. కాలం గడిచిపోతూవుంది. అతను మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. చివరికి "శ్రీనివాసయ్యని గురించి నాకు చాలా తెలుసు అనే మాట నిజమే!" అన్నాడు.

"ఆ సంగతి తెలిసే వచ్చాను" అన్నాడు ఆచార్య.

అతను మళ్ళీ ఆలోచించాడు. ఈసారి అతని కళ్ళు చెమ్మగిల్లినై. "చెపుతాను, చెప్పినవన్నీ అచ్చువేస్తారా?" అని అడిగాడు.

అతని వైఖరిని చూస్తే అనుమానం వేసింది ఆచార్యకు. ఎటుపోయి ఎటువస్తుందో అని "వీలైనంతవరకు" అన్నాడు.

"అయితే వ్రాసుకోండి" అన్నాడు ఒక నిశ్చయానికి వచ్చిన మనిషిల్లే, "ఇంతకుముందు యిక్కడ చాపపరిచి పోయాడే కుర్రవాడు, ఆ కుర్రవాడు ఎవరో తెలుసా?" అని అడిగాడు.

"ఎక్కడో చూచినట్లు వుంది."

"ఆ కుర్రవాడు శ్రీనివాసయ్య కొడుకు. అట్లా చూస్తా రేం! వ్రాసుకోండి..." అన్నాడు మేనేజరు. శ్రీనివాసయ్యకూ నా చెల్లెలికీ పుట్టిన పిల్లడు" కోపంతో అతని మాటలు తడ

బడిన్తై. శరీరం వొణికింది. "దీనికితోడు 40 ఏళ్ళకు150రూపా యీలకు అసలు ఫాయిదాలు ఎంత అవుతుందో లెక్క వేయండి... లెక్కవేసి అదికూడా వ్రాసుకోండి" అన్నాడు.

ఈ ధాటికి ఆచార్య నిర్విణ్ణుడై కూర్చున్నాడు. అతను బయలుదేరినప్పుడు ఇలా జరుగుతుందని కించిత్తు అయినా ఊహించలేదు. ఏదో వెట్టపుట్టించి, లౌక్యంచేసి అతి చాకచక్యంగా విషయాలు మేనేజరు దగ్గరనుంచి తెలుసుకోవలసి వస్తుంది అనుకున్నాడు అదీగాక ఇటువంటి విషయాలు తెలుసుకోవలసివస్తుందని అతను కలలోకూడా అనుకోలేదు. అనుకోని పరిస్థితి, ఊహించని పరిస్థితి, మనసు సిద్ధపడనిపరిస్థితి హఠాత్తుగా వచ్చి మీదపడేటప్పటికి తట్టుకోలేక పోయాడు.

"వ్రాయరేం!" అని అడిగాడు మేనేజరు.

"తెలిసేటట్టు చెప్పా మరి" అన్నాడు ఆచార్య గుక్క తిప్పుకోని.

తెలిసేటట్టు చెప్పాడు మేనేజరు. శ్రీనివాసయ్యని అతను చాలా చిన్నతనంనుంచీ ఎరుగుపట. శ్రీనివాసయ్య చాలా తక్కువ దశలోనుంచి వొచ్చాడట ఆ రోజుల్లో తాను మంచి ఉచ్ఛదశలో ఉండేవాడట తనకు ఒక ప్రెస్ ఉండేదట. ప్రెస్ కివుండే మామూలు పనిచేసుకుంటూ తీరికఉన్నప్పుడల్లా "సెక్స" మీద పుస్తకాలు వ్రాయించి అచ్చువేయిస్తూ ఉండే వాడట. ఆరోజుల్లో సెక్సుమీద పుస్తకాలు వ్రాయటానికి తన దగ్గరకు వస్తుండేవాడట శ్రీనివాసయ్య. ఒక్కొక్క పుస్త

కానికి పది, పదిహేను ఇస్తుండేవాడట తను. క్రమక్రమేకాతన పుస్తకాలు తనే అచ్చు వేయించుకొని, దానిమీద చిన్నపాటి ప్రెస్ సంపాదించి, వృద్ధిచెందాడట శ్రీనివాసయ్య... తన పనేమో నానాటికీ తీసికట్టు అయిందట. చివ్వరికి తను ప్రెస్ అమ్మివేసి పొట్టకోసం తిరగవలసిన స్థితి వొచ్చిందట"అప్పుడు నేను శ్రీనివాసయ్య దగ్గరకు సహాయార్థం వెళ్ళాను. అంతకు ముందు, నేను బాగా వున్న రోజుల్లో అతను నా దగ్గర 150 రూపాయిలు బదులు తీసుకొన్నాడు... ఆ పైకం ఇవ్వమని అడిగాను. అతను నేను చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు... చాలా జాలి నటించాడు. నటించి"వొక్క 150 రూపాయిలు ఇస్తే ఏమవుతుంది? నేను కష్టాల్లో ఉన్నప్పుడు నీవు నాకు సహాయం చేశావు...నువ్వు కష్టాల్లో వున్నప్పుడు నేనుచూస్తూ వుంటానా? నిన్ను పోషించేభారం నాదే" అన్నాడు. అని నా ప్రెస్, నేను ప్రచురించిన కొన్ని పుస్తకాలుంటే అవీ, ఇవీ అవీ ఏమిటి నాకు మిగిలివున్న యావదాస్తి దొంగ క్రయం వ్రాయించుకున్నాడు. అలా చెయ్యకపోతే అప్పులవాళ్ళు ఎగ బడతారనీ, అలా ఎగబడితే నాకు వొక్కచిల్లిగవ్వమిగలదనీ అంతా సర్దుమణిగిం తర్వాత మళ్ళీ నాఆస్తినాకు అప్పగిస్తాననీ చెప్పాడు. ఇదంతానాకోసమేచేస్తున్నానన్నాడు. నేను అతను చెయ్యమన్నట్లు చేశాను. అంతా పూర్తిఅయింతర్వాత నన్ను తన ప్రెస్‌లోకి తీసుకున్నాడు. ... ఇంతవరకు నాకు ఏ అను మానం రాలేదు. కాని రోజులు జరిగిపోతున్నాయ్. అప్పులు ఎప్పుడో సర్దుమణిగినై. కాని నాఆస్తి నా పేర వ్రాయలేదు.

ఒకసారి నిగ్గదీసి అడిగాను. మరునాడు నా చెల్లెలికీ ఈ ఆఫీసులో ఉద్యోగం ఇచ్చాడు. ఆడవాళ్ళకు ఉద్యోగం అంటే ఏమిటో నేను మీకు చెప్పనక్కర లేదు. ఇంటికి ఆలస్యంగా రావటం... కాని నా చెల్లెలికి అతనంటే ఇష్టం ... ఏమిచెప్పాడో ఏమిటో నామాటే నమ్మేది కాదు. పైగా శ్రీనివాసయ్య మంచితనమే నన్నూ నా కుటుంబాన్నీ కాపాడుతూవుందని అనేది. నేను చేసేది లేక ఒదిలి వూరుకున్నాను. చివ్వరికి ఆమెకు గర్భిణీవొచ్చింది. తప్పనిసరి అయినప్పుడు నాకు చెప్పింది. నాకు ఒళ్లుమండిపోయింది. వెళ్లి శ్రీనివాసయ్యమీద పడ్డాను. శ్రీనివాసయ్య నెమ్మదిగా జవాబు చెప్పాడు-"నేను ఆమెను వివాహం చేసుకుందా మనుకున్నాను" అన్నాడు. ఈ మాట నన్ను కుదిపింది. శ్రీనివాసయ్యని నేనే అపార్థం చేసుకున్నానా, నా స్వభావమే నాఅనుమానాలకు కారణమా, అనుకున్నాను. ఆ క్షణం "నిజంగా అతను నా మంచే కోరుతున్నాడేమో!" అనిపించింది. ఇక మాట్లాడ లేకపోయాను. అతనిమెదురుగా నిలబడ లేకపోయాను. తిరిగి వొచ్చి వేశాను. కొన్నాళ్ళు చూశాను. మళ్ళీ అడిగాను. "ఏవో పనుల తొందర్లో వున్నాను." అన్నాడు. ఇదిగో ఇదిగో అంటూ గడిపాడు ఇంతలో నా చెల్లెలు నీళ్లాడింది. పిల్లవాడికి అయిదారు నెలలు వొచ్చినై. "మేము మోసపోయామని" నేను నిర్ధారణ చేసుకున్నాను. ఇంతలో ఒక రోజు నా చెల్లెలు, తనూ శ్రీనివాసయ్యా వివాహం చేసుకోబోతున్నామని చెప్పింది. నేను మంచిదే అన్నాను. కాదనిగానీ, ఇంకో రకంగా జోక్యం

కలిగించుకోనిగానీ ప్రయోజనం లేదనినాకు తెలుసు. తరువాత వారం రోజులు నాచెల్లెలు నాకు కనపడలేదు. ఎనిమిదోరోజు వొచ్చింది. రావటం రావటం పెద్ద జబ్బు పడినదానిలాగు వచ్చింది. ఏ ప్రశ్నకు జవాబు చెప్పదు. పిచ్చిదానిలాగు పిచ్చిచూపులు చూడటం మొదలు పెట్టింది. రాత్రికి జ్వరం వొచ్చింది. ఒకటే వాంతులు. ప్రక్కనున్న డాక్టర్ని పిలిచాను. అతను "ఫుడ్ పాయిజనింగ్" అన్నాడు. కాని తెల్లవారేటప్పటికే ఆమె ఈ లోకాన్ని వొదిపెట్టింది."

మేనేజరు ఆపాడు; తలవంచుకొని వింటున్న ఆచార్య తల ఎత్తిచూశాడు. చాపపరచి వెళ్ళిన కుర్రవాడు ఒక సంచి చేత్తో పట్టుకొని ఇంట్లోనుంచి బయటకు వచ్చాడు. "సరుకులు తెస్తాను," అని మేనేజరుకి చెప్పి ఆచార్య వైపుకి చూపు మలిపి, బయటకు వెళ్లాడు. ఆ కుర్రవాడి పోలికలన్నీ శ్రీనివాసయ్యవే!

"ఇప్పుడా కుర్రవాణ్ని గుర్తు పట్టా రనుకుంటాను," అన్నాడు మేనేజరు.

ఆచార్య నోటితో చెప్పలేక తల ఊపాడు.

* * *

మేనేజరు ఇంటిదగ్గరనుంచి ఫోర్ మన్ రంగయ్యఇంటికి బయలుదేరాడు ఆచార్య ఇప్పుడిప్పుడూ "ఈ పని ఎందుకు మీద పెట్టుకున్నానా," అనిపిస్తూ వుంది అతనికి. కాని మధ్యలో ఆగటం ఇష్టంలేదు. చివరంటా చూద్దామను

కున్నాడు. ప్రొద్దున మాట్లాడినప్పుడు రంగయ్య తన దగ్గరేదో దాస్తున్నట్టు మాట్లాడాడు. అదేదో తెలుసుకోవాలనుకున్నాడు. "కుళ్ళిందన్"కు వెళ్ళాడు.

కుళ్ళిందన్ వొక పెద్ద మురికికూపం. మానవులు నివసించే స్థలంగా లేదు. అందులో పెద్ద పెద్ద కట్టడాలుఉన్నాయి. వొక్కొక్క కట్టడం అనేక చిన్న చిన్న గదులుగా విభజింపబడి వున్నది. వొక్కొక్క గదిలో వొక్కొక్క కాపురం ఉంటుంది. వొక్క కాపురంలో యెంతమంది మనుషులున్నా సరే. అందుకని అక్కడ కాపురం ఉన్నవాళ్లు ఎక్కువమంది. బయటే ఉంటూ ఉంటారు. వాళ్ళని ఆరాతీస్తూ రంగయ్య వుండే గదికి వెళ్ళాడు ఆచార్య. ఆచార్య వెళ్ళేటప్పటికి రంగయ్య యెవ్వరితోనో మాట్లాడుతున్నాడు. అతన్ని శ్రీనివాసయ్య మరణించిన రోజు. అతని ఇంటిదగ్గర చూసినట్లు గుర్తొచ్చింది ఆచార్యకు.

ఆచార్యని చూసేటప్పటికి దిగ్గునలేచి ఎదురుగా వొచ్చాడు రంగయ్య. "అయ్యయ్యో, ఈ మురికికూపంలోకి తమ రెందుకు వచ్చారు!" అన్నాడు తబ్బిబ్బుపడ్డాడు.

నిజంగా అక్కడ మూడో మనిషి కూచోటానికి స్థలం లేదు వొక మూలపొయ్యి, కుండలూ, చట్లూ వున్నయ్. వొక గోడ ప్రక్కన కుక్కిమంచంమీద వొక రోగివుంది. ఆమె రంగయ్య భార్య అయి వుంటుంది. అనుకున్నాడు ఆచార్య ఆ మంచం పక్కనే పిల్లలు ఆడుకుంటున్నారు. గది గుమ్మం దగ్గరగా రంగయ్యా, ఆ రెండో మనిషి వున్నారు.

రంగయ్య తబ్బిబ్బుపడటం చూచి "పరవాలేదు. నేను ఇక్కడకూచుంటాను" అని ఎదురుగావున్న చెక్కపెట్టెమీద కూర్చునాడు.

"రాగూడని స్థలానికి వచ్చారు." అన్నాడు రంగయ్య.

"ఏమండే వచ్చాను నీతో ఇదివరకు చెప్పానే ప్రత్యేక సంచికనీ."

"తమతో చెప్పితినే! నా వల్ల ఏమౌతుంది!"

"నువ్వు నాదగ్గర ఏదో దాస్తున్నావు రంగయ్యా... నువ్వు కుళ్ళిందన్లో ఎందుకు వుంటున్నావు అని అడిగితే ఏదో చెప్పబోయి మళ్లీ నూనివేశావు" అన్నాడు ఆచార్య.

"ఏమిటది?" అని అడిగాడు. కొత్తమనిషి రంగయ్యని. రంగయ్య ప్రత్యేక సంచిక సంగతి చెప్పాడు. "ఇంకా దాపరికం ఎందుకు రంగయ్యా! అసలు మనిషి చెయ్యిదాటిపోయాడు. ఇటువంటారితో ఉన్న సంగతి చెప్పుకుంటేనే మన కేదన్నా దారి. అంతా చెప్పెయ్." అన్నాడు కొత్తమనిషి!

రంగయ్య కాసేపు ఆలోచించాడు. "నేను చెప్పేది మీరు అనుకున్న పనికి సహాయపడదు." అన్నాడు.

"పోనీ.., నాకు సహాయపడుతుంది." అన్నాడు.

రంగయ్య చెప్పాడు —"మీరు కుళ్ళిందన్‌లో ఎందుకు వుంటున్నావు అని అడిగినప్పుడు నేను కొన్ని విషయాలు చెబుదాం అనుకొని దాచినమాట వాస్తవమే. కుళ్లిందన్‌లో

శ్రీనివాసయ్యగారి ఇళ్లే యెక్కువ వున్నయ్ మేముడేంటున్న ఇళ్ళన్నీ వారివే మేము మంచైనా చెడ్డైనా ఈ ఇళ్ళలో అద్దెకు వుండవలసిందే . . . లేకపోతే మా వుద్యోగాలే ఊడతయ్."

ఆచార్యకు అర్థం అయింది. "ఈ జాగాకుఅద్దె ఎంత?" అని అడిగాడు.

"ఎంతైనా యిచ్చుకోవలసిందే ప్రస్తుతం ఇరవైరూపా యాల అరణాలు, నాలుగు రూపాయాల అరణాలతో ప్రారం భం అయి ఇప్పటికి ఇక్కడికివచ్చి ఆగింది. రేపు ఏమవ్వు తుందో తెలియదు."

కొత్తమనిషి అందుకున్నాడు. "ఆయన్ని గురించిచల్లని వేళ తలచుకుంటేనే పాపం. దమ్మిడీకి దమ్మిడి ముడివెయ్యటం కంటేఇంకొక పని లేకపోయె. చేసేప్రతిపనీ, మాట్లాడేప్రతి మాటా అందుకే.ఇంకా పైగా ఆయన్ని గురించి ఒక సంచిక వేద్దాం అనుకుంటున్నారా? మీరు వ్రాయదలచుకుంటేఇంకా ఉన్నయ్ చెపుతా . . " అన్నాడు.

రంగయ్య అందుకున్నాడు,

"కుల్లిందన్‌లో, ప్రక్కనే ఈయనకు వొక పచారీ షాపువుంది. అక్కడ అన్ని సరుకులూ దొరుకుతై. మాకు ఇష్టం వున్నా లేకపోయినా, ధర ఎంతైనా మేము మాసరుకు లన్నీ అక్కడే కొనుక్కోవాలి. లేకపోతే మర్నాడేమావుద్యో గాలు వూడతై," అన్నాడు.

"అంటే"__ఆచార్య మొదలు పెట్టే పెట్టకముందే రంగయ్య మళ్లీ అందుకున్నాడు.

"అవును. ఆ కొట్టుకూడా శ్రీనివాసయ్యదే. ఆయన తరఫున ఈయన నడుపుతున్నాడు."

కొత్త మనిషి అందుకున్నాడు.

"మొదట్లో ఎందుకట్లా తిరుగుతావ్ చింపయ్యా ఏదైనా వ్యాపారం చేసుకో డబ్బు సహాయం చేస్తానన్నాడు. నేను నిజమే అని నమ్మా. మొద్దుముండా కొడుకుని నా కేం తెలుస్తుంది! ఆ దేదో మీరే చెప్పండి అన్నా. ఎక్కడైనా పచారీషాపు పెట్టుకో డబ్బిస్తానన్నాడు. నేను "సరే" అన్నా ఆ షాపుఇక్కడ పెడితే బాగుంటుంది. అన్నాడు నేను "నిజమే" అన్నా షాపు పెట్టాం రంగయ్య చెప్పినట్లు ఎంతకి బడితే అంతకి అమ్ముతున్నాం. మొదట్లో కొట్టుమీద నష్టం చింప య్యా, పాపం నీకు మాత్రం ఎట్లాగడుస్తుంది! ఖర్చుకి నెలకి ఏ పాతికో పరకో తీసుకో లాభాలువస్తే చూద్దాం అన్నాడు. నేను నమ్మా. తరువాత లెక్కలు చూడమంటే ఇదిగోఅదిగో అనడంతప్ప చూడకపోయె, ఇది ఇట్లా వుండగాతీసుకుపోయిఆ కేసులో ఇరికించే"

"ఏ కేసు!-" అడిగాడు ఆచార్య.

"శ్రీనివాసయ్యగారు చింపయ్యతో ఈ వొక్కవ్యాపా రమే కాదు; అనేక వ్యాపారాలు చేయించాడు" అని ప్రారం భించాడు రంగయ్య. తన పలుకుబడితో అనేక పర్మిట్లుఅతని

పేర సంపాదించి బ్లాక్ మార్కెట్ చేయించేవాడు. చివరికి ఎవరో పిటీషన్ పెడితే ప్రభుత్వం దర్యాప్తుచేసి చింపయ్యని అరెస్టు చేశారు. మొదట్లో వున్న సంగతంతా చెపుతా నన్నాడు చింపయ్య. కాని తీరా కేసువిచారణకు వొచ్చేటప్ప టికి ఎందుకనో వ్యాపారం అంతా తనదేనని అబద్ధాలు చెప్పా డు." అన్నాడు రంగయ్య.

"ఎందుకేముంది? ఒక రోజు వొచ్చి బ్రతిమాలాడు— తనను బయటకు లాక్కుండావుంటే నా జీవితానికి ఏ ఇబ్బందీ లేకుండా పదివేలిస్తానన్నాడు. ఏదో పెద్ద ముండాకొడుకు అడుగుతున్నాడు గదా అని ఒప్పుకున్నా."

"ఇంతకీ డబ్బిచ్చాడా?" అడిగాడు ఆచార్య.

"ఎక్కడిచ్చాడు? ఇదిగో అదిగో అని తిప్పుతుండే... ఇంతలోకి తానే చచ్చే..." అన్నాడు చింపయ్య.

ఇంతలోకి మంచంమీద మనిషి మూలుగుతూనే లేచింది. రంగయ్య ఆచార్యని విడిచివెళ్ళటం ఇష్టంలేక తడ బడుతూ చూశాడు...

"నేను వెళ్ళివస్తా!" అని లేచాడు ఆచార్య.

"మేనేజర్ని కలిశారా?" అనడిగాడు రంగయ్య.

"ఆఁ"

"చెప్పాడా?"

"అంతా చెప్పాడు"

"నేను మొదటిలో చచ్చిపోయినవాణ్ని గురించి ఎందుకు చెప్పటం అనుకున్నా-తర్వాత ఉన్న సంగతులన్నీ చెప్పటమే మంచిదని చింపయ్య చెప్పాడు. నాకూ అదే మంచిదనిపించింది. మీకు పనికిరాని సంగతులు చాలా చెప్పాం."

"జర్నలిస్టుకి పనికిరాని సంగతి అనేది వుండదు. పనికి వచ్చేనాటికి పనికి వస్తుంది." అన్నాడు ఆచార్య.

* * *

ప్రత్యేక సంచిక అచ్చయి పోతూవుంది. అదే ఆఖరి రోజు. అవ్వాళతో పూర్తి అవ్వాలి. మరునాడే శ్రీనివాసయ్య దినం. ప్రముఖులు అనేకమంది సానుభూతి సందేశాలూ, ప్రత్యేక వ్యాసాలూ పంపారు. శ్రీనివాసయ్యగారి బహుముఖ ప్రతిభను వేనోళ్ళ కొనియాడారు. ఆయన్ని "అమృతహస్తం" అన్నారు. ఆయన మరణం "ఆంధ్రదేశానికి తీరనిలోటు" అన్నారు. "ఆంధ్రదేశం ఒక ధృవతారను కోల్పోయింది" అన్నారు. ఇక మిగిలింది తన సంపాదకీయమే. ఏం వ్రాయాలో పాలుపోలా ఆచార్యకు. ఇంతలో పోష్టువచ్చింది. అందులో ఒక ఉత్తరం అతనిదృష్టిని ఆకర్షించింది. అది తీసి చింపాడు. ఆ ఉత్తరం బొంబాయినుంచి శాకర్ల భీమశంకరం దగ్గర నుంచి వచ్చింది. ఆతురతగా చదివాడు ఆచార్య. అందులో యిలా వుంది.

"ఆర్యా,

మీ ఉత్తరం మిత్రునిద్వారా చదివాను. శ్రీనివాసయ్యగారి మరణవార్త అంతకుముందే పేపర్లో చూశాను.

చాలా విచారం. నేను వారిని వొక సందర్భంలో మాత్రమే ఎరుగుదును. అది మా యింటి ప్రక్కనవున్న విమలా బి. ఏ. ద్వారా. విమలా బి. ఏ. వారికి చాలా స్నేహితురాలు. వారు బొంబాయి. వచ్చినప్పుడల్లా ఇద్దరూ కలుసుకుంటూ వుండేవారు. ఇటీవల వారు వివాహం చేసుకుందామని కూడా అనుకున్నారు. కాని దైవం మరొక విధంగా తలపెట్టింది. వివాహం కొద్దిరోజులు వుందనగా, విమలా బి. ఏ. "ఫుడ్ పాయిజనింగ్" వల్ల, పాపం అకస్మాత్తుగా మరణించింది. అప్పుడు శ్రీనివాసయ్యగారు ఇక్కడే వున్నారు. పాపం ఆ వయస్సులో ఈ షాక్ ఆయన భరించలేకపోయాడు. ఏమయి ఏం లాభం! ఆయన్ని మేమంతా ఓదార్చి పంపాము. ఇంత కంటే వారిని గురించి నాకేమీ తెలియదు. నేను ఎరిగినంతలో ఆయన చాలా మంచివాడు. సెలవు.

ఇట్లు

భవదీయుడు,

భీమశంకరం కాకర్ల.

ఉత్తరం చదవటం ముగించాడు ఆచార్య. విమలా బి. ఏ. ఫుడ్ పాయిజనింగ్ వల్ల చనిపోయింది. . .మేనేజరు చెల్లెలూ అంతే. పైగా ఇద్దరూ నిర్ణయించబడిన వివాహానికి ముందే. ఏమిటిది?

అతని దృష్టి బల్లమీదవున్న "ఫుడ్ పాయిజనింగ్" అనే గ్రంథంమీద పడింది. అది శ్రీనివాసయ్య డ్రాయర్లో

దొరికింది. శ్రీనివాసయ్యకీ ఫుడ్ పాయజనింగ్‌కీ యేమి సంబంధం!

సీనియర్ సబ్ ఎడిటర్ వచ్చి "మేటరంతా అచ్చయింది." అన్నాడు.

"ఆఁ"

"ఇక సంపాదకీయమే మిగిలివుంది."

ఆచార్య ఆలోచించాడు— "సంపాదకీయం లేదు." అన్నాడు.

"అదీ నోవెల్‌గానే వుంటుంది. నల్ల బోర్డర్లు వేసి విడిచి పెడదాం" అన్నాడు సీనియర్ సబ్ ఎడిటర్ కులుకుతూ.

"ఏ బోర్డరూ అక్కర్లేదు. ఆపట్న విడిచిపెట్టండి. అంతవరకు చాలు." అన్నాడు ఆచార్య.

(బేట్స్ కథ ఆధారం)